నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 21 జూన్ 2025 | ADILABAD NIRMAL



మాజీ మంత్రి జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు పిడుగు స్వామి

# ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ఆదిలాబాద్ టౌన్, ఆదిలాబాద్ రూరల్ మండలాల ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రైతు భరోసాతో పాటు ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకులు అవినీతి ఆరోపణలు చేసినా ఆయన స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. జైనథ్ మండలం కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి పిడుగు స్వామి యాదవ్ బీఆర్ఎస్‌లో చేరగా మాజీ మంత్రి జోగు రామన్న గులాబీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, విజ్జిగిరి నారాయణ, అలాల అజయ్, యూనిస్ అక్బానీ, మెట్టు ప్రహ్లాద్, రాజన్న, గంగ్రత్ రమేశ్, సెవ్వ జగదీశ్, కుమ్ర రాజు, దయాకర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని రేషన్ దుకాణంలో దొడ్డు బియ్యం నిల్వలు

# ముక్కిపోతున్న దొడ్డుబియ్యం



## నాలుగు నెలలుగా రేషన్ దుకాణాల్లోనే..

● సన్న బియ్యం నిల్వలకు స్థలం కరువు ● ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లు

ఆదిలాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రేషన్‌దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం ఏప్రిల్‌లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది. మార్చి నెల వరకు పంపిణీ చేయగా మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తరలించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో రేషన్ షాపుల్లో బియ్యం పురుగులు పట్టి ముక్కిపోతున్నాయి. ఇలా ప్రజాధనం వృథా అవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. మార్చి నెల వరకు తెల్లకార్డుల లబ్ధిదారులకు దొడ్డు (ఫ్లోరిఫైడ్) బియ్యం పంపిణీ చేయగా ఏప్రిల్‌లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కాగా మూడు నెలలుగా లబ్ధిదారుల ఈ బియ్యం తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం లబ్ధిదారులు దుకాణాల ద్వారా పంపిణీ అవుతున్న బియ్యం విక్రయించకుండా తినేందుకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 355 రేషన్ దుకాణాలు ఉండగా, 1,91,755 రేషన్‌కార్డులున్నాయి. ప్రతి నెలా లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం ప్రతి నెలా 4083 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నది. పేదల్లో రక్తహీనత, హిమోగ్లోబిన్ లోపాన్ని తగ్గించేందుకు మార్చి వరకు ఫ్లోరిఫైడ్ రైస్ పంపిణీ చేశారు.

### రేషన్ షాపుల్లో ముక్కిపోతున్న బియ్యం

మార్చి నెల వరకు దొడ్డు బియ్యం కార్డుదారులకు అందించారు. మూడు నెలల కిందట సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కాగా దొడ్డు బియ్యం లెక్కలు పూర్తి చేయలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 355 మంది రేషన్ దుకాణాలుండగా చాలా దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకపోయాయి. బియ్యం లక్కపురుగులు పట్టి పాడవుతుండడంతో ప్రభుత్వానికి నష్టం చేకూరనుంది. వానకాలం నేపథ్యంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో మూడు నెలల కోటా 12,600 మెట్రిక్ టన్నులను కేటాయించింది. జూన్ 1 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభం కాగా 30 వరకు కొనసాగనున్నది. రేషన్ డీలర్లు తమకు ప్రతి నెలా వచ్చే స్టాక్‌కు అనుగుణంగా దుకాణాలు తీసుకుంటారు. మూడు నెలల కోటా ఒకేసారి ఇవ్వాల్సి రావడంతో దొడ్డు బియ్యం నిల్వల కారణంగా సన్న బియ్యం ఎక్కడ ఉంచాలో తెలియడం లేదు. స్థలం లేకపోవడంతో గోదాంల నుంచి తక్కువ బియ్యం తెచ్చుకుంటున్నారు. దీంతో బియ్యం పంపిణీలో కొంత జాప్యం జరుగుతున్నదని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దొడ్డు బియ్యం నిల్వలు క్లియర్ చేయాలని కోరుతున్నారు.



ఖానాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

## ఖానాపూర్‌లో అఖిల పక్ష నాయకుల నిరసన

ఖానాపూర్, జూన్ 20 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి రెండో రోజు కూడా నిరసన చేపట్టారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సుజాతకు పలు అంశాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం పేరిట మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్, డిగ్రీ కళాశాలను కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు తరలించడంపై ప్రశ్నించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల విద్యార్థులు నాణ్యమైన విద్యను నోచుకోకుండా చేయడం సరికాదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపినట్లు వివరించారు. మంజూరైన రూ.200 కోట్లతో కుమ్రం భీం చౌరస్తాలోని 110 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పాలకుల స్వార్థం కోసం ఉట్నూర్‌లో భవన నిర్మాణం చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖానాపూర్ ప్రాంతంలో భవన నిర్మాణ పనులు చేపట్టకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, గౌరికర్ రాజు, నంది రామయ్య, ప్రదీప్, నారాయణ, సతీశ్, గంగరావు, గోపాల్ పాల్గొన్నారు.

# మొరాయించిన ఆన్‌లైన్ సేవలు

## కుభీర్ తహసీల్ కార్యాలయం వద్ద ప్రజల పడిగాపులు

కుభీర్, జూన్ 20 : కుభీర్‌లోని తహసీల్ కార్యాలయంలో ఇంటర్నెట్ లేక రెండు రోజులుగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కులం, ఆదాయ, నివాస, నాన్ క్రిమిలేయర్ వంటి ధ్రువీకరణ పత్రాలు, తదితర పత్రాల కోసం తహసీల్ కార్యాలయానికి సుమారు వంద మంది వరకు వచ్చారు. ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాసి ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది. బీఎస్ఎన్ఎల్ టీజీ స్వాన్‌అండర్ గ్రౌండ్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ కట్ అవ్వడంతోనే ఈసమస్య తలెత్తినట్లు తహసీల్దార్ శివరాజ్ వెల్లడించారు. సంబంధితశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్రువీకరణ పత్రాలు జారీలో ఇబ్బంది లేకుండా విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.



కుభీర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు

# ఎవరికీ భారం కావద్దని

## చెరువులో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

నిర్మల్ అర్బన్, జూన్ 20 : అనారోగ్యంతో ఉన్న తాము ఎవరికీ భారం కావద్దని భావించిన తల్లీకూతుళ్లు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన నిర్మల్ పట్టణంలో శుక్రవారం జరిగింది. నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన సుంకరి లక్ష్మీబాయి(75)కి ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. లక్ష్మీబాయి కొడుకుల వద్ద కాకుండా వివాహం కాని కూతురు గౌరమ్మతో కలిసి ఉంటుంది. గౌరమ్మకు డయాబెటిస్ కారణంగా గతంలో కాలును తొలగించారు. లక్ష్మీబాయి కూడా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఇద్దరు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయారు. తాము ఎవరికీ భారం కావద్దని భావించి శుక్రవారం ఉదయం బంగల్‌పేట్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చెరువులో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

# పాత కక్షలతోనే డీసీసీబీ చైర్మన్ కిడ్నాప్

## ఆరుగురి అరెస్ట్, రెండు కార్లు, నగదు, ఆభరణాలు స్వాధీనం

నిర్మల్ అర్బన్, జూన్ 20 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ డీసీసీబీ చైర్మన్ చిక్యాల హరీశ్‌రావు కిడ్నాప్ హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడైన షేక్ హైదర్ (బీజేపీ మైనార్టీ మోర్చా కన్వీనర్) గతంలో చిక్యాల హరీశ్‌రావు వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇతని ప్రవర్తన నచ్చక 6 నెలల క్రితం పనిలోంచి తీసేశాడు. దీంతో హరీశ్‌పై హైదర్ పగ పెంచుకుని కిడ్నాప్ చేసేందుకు ప్లాన్ వేశాడు. ఈ క్రమంలో హైదర్ మిత్రుడైన గుంటూరుకు చెందిన బానాల ప్రిన్స్, విజయవాడకు చెందిన తట్టూరి రవి, కళకంటి సురేశ్, కోటేశ్వర్ రావు, పొన్కల్‌కు చెందిన మధుసూదన్ నిందితులుగా ఉన్నారు. హరీశ్‌ను కిడ్నాప్ చేసేందుకు వీరందరూ ముందుగానే ప్లాన్ వేసుకున్నారు. పొన్కల్‌కు చెందిన మధుసూదన్ హరీశ్‌రావుకు సంబంధించిన రాకపోకలను వారికి తెలిపారు. కిడ్నాప్ చేసేందుకు రెండు కార్లు అద్దెకు తీసుకుని ఈ నెల 15న అర్ధరాత్రి అతని ఇంటికి చేరుకున్నారు. హరీశ్‌రావు ఇంటిపై కప్పు ద్వారా లోపలికి ప్రవేశించి అతని చేతులు, కాళ్లు కట్టేసి, నోరు మూసి బెదిరించి బంగారు చైన్, బంగారు బిల్లలు, డైమండ్ ఉంగరం, రూ.5 వేల నగదును దొంగలించి బాధితుని కారులో కిడ్నాప్ చేసి హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అతన్ని కత్తులతో బెదిరించి బంధువులకు ఫోన్ చేయించి రూ.3 కోట్లు డిమాండ్ చేశారు. టోల్ ప్లాజా వద్ద కార్ పాస్టాగ్ స్కాన్ కాకపోవడంతో కారును ఆపగా అదే అదునుగా చూసుకుని హరీశ్‌రావు కారులోంచి దూకి పరారయ్యాడు. దొరికిపోతామని అనుకున్న నిందితులు టోల్‌గేట్ గేట్‌ను విరగ్గొట్టి కొద్ది దూరం వెళ్లిన తర్వాత వదిలేసి కిరాయి కారులో దోచుకున్న సొత్తుతో ఉడాయించారు. జిల్లా ఎస్పీ 5 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నాలుగు రోజుల్లోనే నిందితులను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి కిడ్నాప్‌నకు వాడిన కారు బంగారు చైన్, పర్సు, రూ.2 వేల నగదు, 6 సెల్‌ఫోన్‌లు, రెండు కత్తులు, ప్లాస్టర్, వదిలి వేసిన కారును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఏఎస్పీ రాజేశ్ మీనాను, సీఐలు గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్, పోలీసులను అభినందించారు.

# తాగు నీటికి తంటాలు

● కిలో మీటర్ల దూరం నుంచి నీటిని తీసుకొస్తున్న గిరిజనులు ● మిషన్ భగీరథ నీరు రాక అవస్థలు

*గాదిగూడ మండలంలోని ఖడ్కి, అర్జుని పంచాయతీ పరిధిలోని జంగుబాయిగూడలో తాగునీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఖడ్కి, జంగుబాయి గూడవాసులు కిలో మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావి, చేతి పంపు నుంచి తాగునీటిని ఎడ్లబండ్లు, నెత్తిన బిందెలతో నీటిని తీసుకొచ్చుకుంటున్నారు. దీంతో సకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.* - నార్నూర్, జూన్ 20



బిందెలతో నెత్తిమీద తాగునీరు తీసుకెళ్తున్న గిరిజనులు



జంగుబాయి గూడలోని చేతిపంపు వద్ద తాగునీటి కోసం నిరీక్షిస్తున్న కొలాం గిరిజనులు



ఖడ్కిలోని వ్యవసాయ బావిలో తాగునీటిని డ్రమ్ములో నింపుతున్న గిరిజనుడు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ గణేశ్ నిరంజన్

# గిరిజనుల అభివృద్ధి కోసమే 'జన్‌మన్'

ఉట్నూర్ / ఉట్నూర్ రూరల్ /ఇంద్రవెల్లి, జూన్ 20 : గిరిజనుల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం తీసుకొచ్చిందని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ గణేశ్ నిరంజన్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చిన ఆయనకు పీవో ఖుష్బూ గుప్తా స్వాగతం పలికారు. అనంతరం సికిల్ సెల్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్‌మన్ పథకం ద్వారా గిరిజనులకు కావాల్సిన సౌకర్యాలతో పాటు మీ సేవా ద్వారా చిన్నారులకు బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్లు, జాబ్ కార్డులు, ఆధార్‌కార్డులు అందేలా చూడాలన్నారు. అనంతరం జిల్లాలో జన్‌మన్ పథకం అమలు తీరు, సమస్యలను పీవో వివరించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు. అనంతరం ఉట్నూర్ మండలంలోని కొలాం గూడను సందర్శించారు. వాల్యూ ఎడిషన్ స్కిల్స్ ట్రైనింగ్ దాల్ మిల్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఇంద్రవెల్లి మండలంలోని మారూతిగూడలోని నూతనంగా నిర్మిస్తున్న మల్టిపర్పస్ సెంటర్‌ను పరిశీలించారు. పీఎం జన్‌మన్ పథకంలో చేపట్టిన పనులను కొలాం గిరిజనులకు వివరించారు.

# బాసర అభివృద్ధిపై పట్టింపేది ?

## సరస్వతీ ఆలయంపై ఎందుకింత చిన్న చూపు ?

● రేవంత్ సర్కారుపై సొంత పార్టీ నేత నారాయణ్‌రావు పటేల్ మండిపాటు
● నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్, డీసీసీ అధ్యక్షుల ముందే వ్యాఖ్యలు

బాసర, జూన్ 20 : బాసర సరస్వతీ ఆలయ అభివృద్ధిని పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని నిర్మల్ జిల్లాలోని ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం బాసర మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా బాసర, ముథోల్ మండలాల పార్టీ కార్యవర్గాలను నియమించారు. ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపటేల్ మాట్లాడారు. బాసర అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. ఆలయంలో సరిపడా సిబ్బంది లేరని, ఇన్‌చార్జి ఈవోతో ఆలయంలో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. ఇంజినీరింగ్ వ్యవస్థ లేదని, ఇన్‌చార్జిల పాలన నడుస్తున్నదని, రెగ్యులర్ అధికారులను వెంటనే నియమించాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన రూ.50 కోట్లలో రూ.8 కోట్లు ఖర్చు చేసి మిగిలిన వాటిని మళ్లీ వెనక్కి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా వేములవాడకు భారీగా నిధులు కేటాయించి మాస్టర్ ప్లాన్ రెడీ చేసి అభివృద్ధి పరుస్తున్నారన్నారు. కానీ బాసర ఆలయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ బాసర అభివృద్ధికి విడుదలైన నిధుల్లో వెనక్కి వెళ్లిన వాటిని నెల రోజుల్లో వచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. అదే విధంగా బాసర మాస్టర్ ప్లాన్‌కు పీఠాధిపతుల అనుమతులు లభించాయని, నెల రోజుల్లో పూర్తి బాధ్యతలు గల ఈవోను బాసర ఆలయానికి నియమించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బాసరలో మాట్లాడుతున్న ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నారాయణ్‌రావుపటేల్

### బీఆర్ఎస్ నిధులిస్తే.. వెనక్కి తీసుకెళ్లింది కాంగ్రెస్సే..



*బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బాసర అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయగా అందులో నుంచి రూ.8 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ వచ్చాకా రూ.42 కోట్లను వెనక్కి తీసుకున్నది. వీటన్నింటిని తెలుసుకోకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. బాసర అభివృద్ధికి విడుదలై వెనక్కి వెళ్లిన రూ.42 కోట్లను తీసుకువచ్చి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని ఆశిస్తున్నాం.*

**- కోర్వ శ్యాం, బీఆర్ఎస్ బాసర మండల కన్వీనర్**

# అంగన్‌వాడీలు ఆగమాగం

● పోస్టులను భర్తీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
● నిర్మల్ జిల్లాలో 93 టీచర్లు, 385 హెల్పర్ల పోస్టులు ఖాళీ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 20 : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత సమస్య పట్టి పీడిస్తోంది. ఫలితంగా నిర్మల్ జిల్లాలో మహిళలకు పౌష్టికాహారం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల నియామకాన్ని చేపడతామంటూ ప్రకటనలు ఇస్తూ కాలం వెల్లదీస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియామకాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరాశ తప్పడం లేదు. నిర్మల్ జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, ముథోల్, భైంసా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 926 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో మొత్తం 93 టీచర్, 385 హెల్పర్ పోస్టులు ఖాళీలున్నాయి. నియామకాలు చేపట్టకపోవడంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. చాలా చోట్ల టీచర్లు ఉంటే సహాయకులు లేరు. సహాయకులుంటే టీచర్లు లేరు. కొన్ని చోట్ల ఇద్దరు లేకపోవడంతో సమీపంలోని కేంద్రాల సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యకు దూరం అవుతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది నియామకం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మంజులాపూర్-4 సెంటర్‌లో భోజనం చేస్తున్న చిన్నారులు